నత్తనడకన 'ఉపాధి' పనులు

- పెండింగ్‌లో 35వేల పని దినాలు
- మండలంలోని కూలీలు 14,616 మంది
- లక్ష్యం పూర్తి చేసేందుకు అవసోపాలు
- వారం రోజులే గడువు



కౌటాలలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

కౌటాల: వలసలు నివారించేందుకు ఏటా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలకు ప్రభుత్వం పనులు కల్పిస్తోంది. కౌటాల మండలంలో కూడా ఉపాధి పనులు జరుగుతున్నాయి. కానీ గతంతో పోల్చితే కూలీల హాజరు తక్కువగా ఉంటుంది. ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వం తిరిగి విధుల్లోకి తీసుకున్నా పనుల్లో మాత్రం వేగం పెరగడం లేదు. పనులపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో అనుకున్న స్థాయిలో పనిదినాలు పూర్తి చేయలేకపోతున్నారు. ఈ నెల 31వ తేదీలోగా అనుకున్న లక్ష్యం చేరుకోవాలి. కానీ ఇప్పటివరకు పని దినాల సంఖ్య తక్కువగా నమోదైంది. దీంతో ఏం చేయాలో అధికారులకు పాలుపోవడం లేదు.

పెండింగ్‌లో పని దినాలు..

గడువు సమీపిస్తుందంటే ఉపాధిహామీ సిబ్బందికి ముచ్చెమటలు పడుతున్నాయి. ఉన్న ఊరిలోనే వ్యవసాయ పనుల్లో గ్రామీణ ప్రజలు బిజీగా ఉన్నారు. దీంతో ఉపాధిహామీ పనుల లక్ష్యం చేరుకోవడం కష్టంగా మారింది. మిగిలిన కొద్ది రోజుల్లో లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏటా మాదిరిగానే 2023 –24 ఆర్థిక సంవత్సరానికి ఉపాధిహామీ నిధులను కూలీ పనులకు, కూలీలకు, మెటీరియల్‌కు ఖర్చు చేయాల్సి ఉంటుంది. మండల వ్యాప్తంగా 3,35,609 పని దినాలు మార్చి 31 నాటికి పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 3,00,500 పనిదినాలు మాత్రమే నమోదయ్యాయి. మిగిలిన వారం రోజుల్లో 35 వేలకు పైగా పనిదినాలు పూర్తి చేయాల్సి ఉంది. ఈ లక్ష్యం పూర్తి చేయాలని అధికారులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. పని చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలకు సిద్ధమవుతున్నారు.

టార్గెట్‌పై దృష్టి

మండల వ్యాప్తంగా పూర్తి స్థాయిలో వ్యవసాయ పనులు పూర్తి కాలేదు. దీంతో కూలీలు ఉపాధి పనుల వైపు కన్నెత్తి చూడలేదు. ఫలితంగానే కూలీల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఇప్పుడిప్పుడే వ్యవసాయ పనులు తగ్గుముఖం పట్టాయి. కూలీలు కూడా ఉపాధి పనుల వైపు మొగ్గుచూపుతున్నారు. రానున్న వారం రోజుల్లో ఈ లక్ష్యం ఎలా చేరుకోవాలో అర్థంకాక ఈజీఎస్ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. గతంలో మాదిరిగా వేలాది కూలీలు పనికి వచ్చేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నారు. మిగిలిన ఉపాధి పని దినాలను పూర్తి చేయాలని ఈజీఎస్ సిబ్బందితో అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఆదేశాలు జారీ చేస్తున్నారు. గడువులోగా పని దినాల లక్ష్యాలు పూర్తి చేయడానికి సంబంధిత అధికారులు ప్రత్యేక ప్రయత్నాలు చేస్తున్నారు.

14,616 మంది కూలీలు

మండలంలో మొత్తం 7349 జాబ్‌కార్డు కుటుంబాలు ఉన్నాయి. వాటిలో 600లకు పైగా శ్రమశక్తి సంఘాలున్నాయి. మొత్తం 14,616 మంది ఉపాధిహామీ కూలీలు ఉన్నారు. గతంలో రోజుకు 10వేల మందికి పైగా కూలీలు ఉపాధిహామీ పనులకు వెళ్తుంటారు. కానీ ఈసారి మిర్చి పంట కోతలు పూర్తి కాకపోవడంతో కూలీలు మిర్చి కోతలకు వెళ్తున్నారు. దీంతో రోజుకు కనీసం 2వేల మంది కూలీలు కూడా పనికి రావడం లేదు. అలాగే వేతనాలు సైతం సక్రమంగా రాకపోవడంతో ఉపాధి పనులకు వెళ్లేందుకు కూలీలు గతంలో మాదిరి ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం ఎండలు మండుతుండడంతో పని ప్రదేశాల్లో కూలీలకు కనీస వసతులు కల్పించాలని కూలీలు పేర్కొంటున్నారు.

లక్ష్యం పూర్తి చేస్తాం



వ్యవసాయ పనులు ఉండడంతో కూలీలు ఎక్కువగా ఉపాధి పనులకు రావడం లేదు. మార్చి 31 నాటికి ఉపాధిహామీలో ఉన్న లక్ష్యం పూర్తి చేస్తాం. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి కూలీల సంఖ్య పెరిగేలా చూస్తున్నాం. ఉపాధిహామీ పనుల లక్ష్యం చేరుకోవాలని ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయి. పనుల లక్ష్యాన్ని చేరుకోవాలని ఈజీఎస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నాం. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ఉపాధిహామీ కూలీలు పని దినాలను సద్వినియోగం చేసుకోవాలి.

– పూర్ణిమ, ఈజీఎస్ ఏపీవో, కౌటాల

క్లుప్తంగా

క్రీడల్లో గెలుపోటములు సహజం



బహుమతులు అందిస్తున్న నాయకులు

కౌటాల: క్రీడల్లో గెలుపోటములు సహజమని ముత్తంపేట్ మాజీ సర్పంచ్ సత్యనారాయణ అన్నారు. మండలంలోని ముత్తంపేట గ్రామంలో నిర్వహిస్తున్న ముత్తంపేట్ ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీలు శనివారం ముగిశాయి. మాజీ ఉప సర్పంచ్ వెంకటేశ్, నిర్వాహకులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో ఆత్రం సక్కు పూజలు



పూజలు చేస్తున్న ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు శనివారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో విజయం చేకూరాలని అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వెలగని వీధి దీపాలు



వెలగని వీధి దీపం

దహెగాం: మండలంలోని మారుమూల గిరిజన గ్రామం లోహాలో గత నాలుగు నెలల నుంచి వీధి దీపాలు వెలగడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో సుమారు 30 కుటుంబాలు ఉన్నాయి. వీధి దీపాలు ఏర్పాటు చేయక పోవడంతో గ్రామస్తులు రాత్రి వేళల్లో బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పోలింగ్ బూత్‌లో సౌకర్యాలు కల్పించాలి



పరంధోళి పోలింగ్ బూత్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీవో

కెరమెరి: త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ బూత్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆర్‌డీవో లోకేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని పరంధోళి, ముకదంగూడ గ్రామపంచాయతీల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, మురుగుదొడ్లు, ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడారు. తహసీల్దార్ దత్తుప్రసాద్, డీటీ సంతోష్ కుమార్ తదితరులు ఉన్నారు.

పెంచికల్‌పేట్ ఎంపీడీవోగా అల్బర్ట్



ఎంపీడీవోకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

పెంచికల్‌పేట్: మండల నూతన ఎంపీడీవోగా అల్బర్ట్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ నుంచి అల్బర్ట్ బదిలీపై రాగా ఎంపీవో గంగాసింగ్ ఆధ్వర్యంలో పంచాయితీ కార్యదర్శులు, ఎస్ఆర్ఈజీఎస్ సిబ్బంది స్వాగతం పలికారు.

నేడు లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పూజలు

రెబ్బెన: మండలంలోని రాళ్లపేటలో గల పురాతన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మురళీధర్ తెలిపారు. ఏటా హోలీ రోజున ఆలయంలో స్వామి వారికి అభిషేక కార్యక్రమాలతో పాటు జాతర మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు



విజేతకు బహుమతి అందజేస్తున్న ఎంపీపీ

కెరమెరి: మండలంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి జాతర సందర్భంగా రెండు రోజుల క్రితం ప్రారంభమైన కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. మొత్తం 22 జట్లు పాల్గొనగా విజేతగా టీఎంకే 7స్టార్ జట్టు గెలిచింది. ద్వితీయ స్థానంలో శ్రీ వెంకటేశ్వర, తృతీయ స్థానంలో ఆదివాసీ నగర్ జట్లు నిలిచాయి. విజేతకు ఎంపీపీ పెందోర్ మోతీరాం రూ.21000 నగదు అందించగా, ద్వితీయ విజేతకు కుమురం భీంరావు(ఆత్రం సక్కు యూత్ ఫోర్స్ అధ్యక్షుడు) రూ.15000, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పెందోర్ ఆనంద్‌రావు రూ.7777 నగదు బహుమతి అందించారు. నిర్వాహకులు కోవేశ్‌రావు, ఎల్లప్ప, శ్రీనివాస్, పెందోర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

కెరమెరి: మండలంలోని చొపన్‌గూడ గ్రామానికి చెందిన శ్రీ చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం బస్టాండ్ ప్రాంతంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండుతున్న ఎండల దృష్ట్యా ప్రయాణికుల దప్పిక తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సంఘం అధ్యక్షుడు వసంత్‌రావు తెలిపారు. సంఘ సభ్యులు జంగు, సాగర్, రమేశ్ తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



కెరమెరి: ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీలు



దహెగాం: మాట్లాడుతున్న సీడీపీవో

కౌటాల: పిల్లలు, బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. పోషణ పక్షంలో భాగంగా శనివారం మండలంలోని గురుడుపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ ప్రత్యేకాధికారి పాలకుర్తి రాజేశ్, సూపర్‌వైజర్ షాకీరాబేగం, అంగన్‌వాడీలు, ఆయాలు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: పోషకాహారంతోనే గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో సురేఖ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక అంగన్‌వాడీ4 కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ అనసూర్య, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, మమత, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

కెరమెరి: గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్లు కుమారి, లత అన్నారు. 'పోషణ్ పక్వాడ్' పక్షోత్సవాల్లో భాగంగా కెరమెరి, కరంజివాడ, గోయగాం సెక్టార్‌లలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు.

వాంకిడి: లక్ష్మీపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. కూరగాయలు, చిరుధాన్యాలు, పోషకాలతో కూడిన వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శించారు. అంగన్‌వాడీ టీచర్ రాజ్‌కుమారి, పొచ్చుబాయి పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మండలంలోని దరోగపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు, కిశోర బాలికలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

చింతలమానెపల్లి: ఆహారంలో చిరుధాన్యాల వినియోగంతో ఆరోగ్యవంతమైన జీవితం గడపొచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ అన్నారు. శనివారం మండలంలోని రవీంద్రనగర్ ఐసీడీఎస్ క్లస్టర్ పరిధిలోని రణవెల్లిలో పోషణ పక్షమాసోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, మహిళా గ్రూప్ అధ్యక్షురాలు రూప, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో సాదీయా అన్నారు. శనివారం మండలంలో ఎల్లారం గ్రామంలో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా అంగన్ వాడీ సెంటర్‌లో పోషకాహారంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ రాంబాయి, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, మల్లుబాయి పాల్గొన్నారు.

108లో ప్రసవం



శిశువును కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న సిబ్బంది

వాంకిడి: మండలంలోని ఖమాన గ్రామానికి చెందిన గర్భిణీ ఆర్.లీలాబాయి శుక్రవారం అర్ధరాత్రి 108 వాహనంలో మగ శిశువుకు జన్మనిచ్చింది. ఈఎంటీ రజినీకాంత్, పైలెట్ భీంరావు తెలిపిన వివరాల ప్రకారం రాత్రి 2 గంటలకు లీలాబాయిని ఖమాన నుంచి వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే క్రమంలో పురిటి నొప్పులు ఎక్కువ కాగా మార్గమధ్యలో అంబులెన్స్‌లోనే ప్రసవం చేసినట్లు తెలిపారు. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారని, వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించినట్లు పేర్కొన్నారు.

ధ్యానమార్గంలో నడవాలి

కాగజ్‌నగర్‌రూరల్: చెడు గుణాలు వీడాలంటే ధ్యానమార్గంలో నడవాలని సద్గురు పూలాజీబాబా ముఖ్య సంస్థాన్ సభ్యులు భగవంత్‌రావు అన్నారు. శనివారం మండలంలోని రాస్పెల్లి గ్రామంలోని సద్గురు పూలాజీబాబా ధ్యానకేంద్రం 11వ వార్షికోత్సవ సభలో పాల్గొని మాట్లాడారు. అమృతవాణిని ఆధ్యాత్మిక రూపంలో వినిపించారు. ధ్యాన కేంద్రం అధ్యక్షుడు మొండి, సభ్యులు సోంజి, తిరుపతి, కృష్ణ, కాశయ్య, చందు, మాజీ సర్పంచ్ గజ్జి వాసుదేవ్, లచ్చుమెర, మల్లేశ్ పాల్గొన్నారు.

'పంటలకు వట్టివాగు నీరు అందేలా చూడాలి'

రెబ్బెన: మండలంలో వట్టివాగు కెనాల్ల కింద సాగు చేస్తున్న యాసంగి పంటలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ కోరారు. శనివారం కలెక్టర్ వెంకటేష్ దోత్రేను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో గల వట్టివాగు డీ9, డీ10 కెనాల్స్ కింద నక్కలగూడ, పుంజుమేరగూడ, రెబ్బెన, ఇందిరానగర్, ఎడవెల్లి , ఖైరిగాం ప్రాంతాల్లో రైతులు యాసంగి పంటలను సాగు చేస్తున్నారన్నారు. గత 10 రోజులుగా పంట పొలాలకు వట్టివాగు ప్రాజెక్టు నీరు అందకపోవటంతో పొలాలు ఎండిపోతున్నాయన్నారు. మరికొన్ని రోజుల్లో దిగుబడులు చేతికి అందే దశలో ఉన్న పంటలకు సాగునీరు అందకపోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. వెంటనే మండలానికి వట్టివాగు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

బస్టాండ్లు నిర్మించాలని వినతి

మండల కేంద్రం మీదుగా చేపట్టిన నాలుగు లైన్ల జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో తొలగించిన బస్టాండ్‌ల స్థానాల్లో కొత్త బస్టాండ్లు నిర్మించాలని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

మండుటెండలో బడికి..!



పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

కౌటాల: పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం బడి ఉండడంతో విద్యార్థులు మండుటెండలో బడికి వెళ్తున్నారు. పాఠశాలల్లో ఉక్కపోత కారణంగా విద్యార్థులు పాఠాలు సరిగా వినడం లేదు. మధ్యాహ్నం 2 గంటలకు భోజనం పెడుతుండడంతో విద్యార్థులు ఆకలితో ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం వేళ బడి ఉండడంతో విద్యార్థులు బడికి వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి వరకు 319 మంది విద్యార్థులుండగా శనివారం 160 మంది మాత్రమే హాజరయ్యారు.

ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రెబ్బెన: మండల కేంద్రంలో శనివారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 93వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డీవైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన మహాయోధుడు భగత్‌సింగ్ అన్నారు. నాయకులు కృష్ణ, శివ, తిరుపతి, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: భగత్‌సింగ్ ఆశయాల కోసం పోరాడాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో భగత్ సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. పీడీఎస్‌యూ నాయకులు అశ్విత్, కార్తిక్, యశ్వంత్, దేవనంద్ విద్యార్థులు పాల్గొన్నారు.

26న పండ్ల తోటల వేలం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని జంబుగ ఉద్యాన నర్సరీలోని పండ్ల తోటల ఫల సాయాన్ని వేలం వేయనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిణి ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. నర్సరీలో ఉన్న సపోటా, మామిడి, నిమ్మతోటలను ఈనెల 26న ఉదయం 11 గంటలకు జంబుగ తోటలో వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వ్యాపారస్తులు వేలంలో పాల్గొనాలని సూచించారు.

పాఠశాలల్లో హోలీ సంబరాలు



హోలీ వేడుకలు జరుపుకుంటున్న విద్యార్థులు



ఆసిఫాబాద్‌రూరల్: రంగులతో పిల్లలు..

రెబ్బెన: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు ముందస్తు హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని అన్నపూర్ణ హైస్కూల్‌తో పాటు, రెబ్బెన ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో విద్యార్థులు కేరింతలు కొడుతూ రంగులు చల్లుకుంటూ హోలీ సంబరాల్లో పాల్గొన్నారు.

శిశుమందిర్ పాఠశాలలో..

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో శనివారం విద్యార్థులు ముందస్తు హోలీ పండుగ జరుపుకున్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థులకు జ్యూస్ పంపిణీ

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులకు శనివారం ఎస్సై కొమురయ్య జ్యూస్ పంపిణీ చేశారు. విద్యార్థులు వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. శ్రీనివాస్, కొండయ్య, అనిల్, సాయిరాం, తొగయ్య, రైతు గణపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గణిత పరీక్ష

కెరమెరి: మండలంలోని కెరమెరి, మోడి పరీక్ష కేంద్రాల్లో శనివారం జరిగిన పదో తరగతి గణిత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మండలంలోని కెరమెరి, గోయగాం, అనార్‌పల్లి, మోడి, కేజీబీవీ, హట్టి, రాంజీగూడ, ఝరి పాఠశాలలకు చెందిన మొత్తం 296 విద్యార్థులకు 293 మంది హాజరైనట్లు సీఎస్‌లు చంద్రశేఖర్, స్వర్ణలత, డీవోలు ప్రేంసింగ్, అచ్యుతానంద్ తెలిపారు. కెరమెరిలో 141, మోడి పరీక్షల కేంద్రంలో 152 మంది విద్యార్థులు హాజరయ్యారు.

జర్నలిస్టులపై నిర్లక్ష్యం వీడాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జర్నలిస్టులపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడాలని జర్నలిస్ట్ సంఘం నాయకులు పేర్కొన్నారు. శనివారం జిల్లాకేంద్రంలో కలెక్టరేట్ ఎదుట టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ముందుగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావ్, ఎంపీపీ మల్లిఖార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నార్ రమేశ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు దివాకర్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ పాల్గొన్నారు.

బీఎస్ఏ అవార్డ్ సెలెక్షన్ కమిటీ సభ్యుడిగా అభిలాష్

వాంకిడి: బహుజన సాహిత్య అకాడమీ అవార్డ్ సెలక్షన్ జిల్లా కమిటీ సభ్యుడిగా మండలానికి చెందిన నూతి అభిలాష్ నియమితులయ్యారు. ఈ మేరకు బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

ఇఫ్తార్ విందుకు హాజరైన ఎమ్మెల్సీ



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ విఠల్, ఆత్రం సక్కు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్, ఆదిలాబాద్ ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు పాల్గొన్నారు. ఎంతో నియమ నిష్టలతో రంజాన్ పండుగను ముస్లింలు జరుపుకుంటారని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. నాయకులు సాదిక్ తదితరులు ఉన్నారు.

రంగుల మోదుగు పుష్పం





ప్రస్తుతం ఆదివాసీ ప్రాంతాల్లో ఎటు చూసిన మోదుగు చెట్లు దర్శనమిస్తున్నాయి. పొలాల గట్లపై, నదీ తీరంలో, చెరువుల వద్ద, అడవుల్లో చెట్లపై మోదుగు పూలు విరివిగా పూసి చూపరులను ఆకర్షిస్తున్నాయి. ఆదివాసీలు మోదుగుపూలతో తయారుచేసిన రంగులను హోలీ పండుగ రోజు వినియోగిస్తుంటారు. హోలీకి ఒకరోజు ముందే మోదుగు పూలను తీసుకొచ్చి నీళ్లల్లో నానబెట్టి రోకలితో దంచుతారు. దంచిన పూలను నీళ్లల్లో కలిపి రంగుగా వాడుతారు.

– కెరమెరి